## కూర్చోటం గురించి!

(ముక్కాణీలు)

-శ్రీరామ కవచం సాగర్

కూర్చున్నాక ఎలా కూర్చోవాలి
కంటి రెప్పను ఎలా నిలబెట్టాలి
చేతులను ఎలా సమాధాన పర్చాలి
* * * *
నిరంతరం నా కాళ్ళు ఎందుకు వూరుకోవు!

---

కూర్చోటం అంటే ఓ గోడ కుర్చీ
శిక్షా స్మృతిని నిరాకరించే ఓ పసితనం
బడిని ఎగ్గొట్టి ఆడుకునే ఓ తిరుగుబాటు
* * * *
కూర్చోటం నాకో జైలు శిక్ష! నిలబడే ఎదిరిస్తాను!

---

అటూ ఇటూ చాలామంది నాలానే
కూర్చొనే వుంటారు స్వేచ్ఛని మర్చిపోయి
తనని తాను బంధించుకొనే వాడు ఓ భద్ర జీవి
* * * *
నేను నిరంతరం సరిగ్గా కూర్చోలేక విఫలమైనవాడిని!

---

## ఎక్కడా కూర్చో ఒద్దన్నాక!

ఇవ్వన్నీ చాలా సంకెళ్ళు
చేతులూ వుండవు – కాళ్ళూ వుండవు
అసలు మనుష్యులూ –మనుష్యులానూ వుండరు
* * * *
యధాలాపంగా శిక్షని అనుభవిస్తానే వుంటారు!

---

ఇది నా పూర్వీకులు నాకు విధించిన శిక్ష
నేను వాళ్ళ కాళ్ళూ చేతులతో పుట్టటం ఓ నేరం
వాళ్ళ రూపంతో ఎక్కడా కూర్చోలేక పోతున్నా
* * * *
కాని వాళ్ళు నాలో ఎందుకు తిష్ట వేస్తారో పాపం!

---

ఓ పూర్వీకుడి  శిక్షని నేను మోస్తున్నాను
ఏ న్యాయస్థానం ప్రశ్నించని దిగులు నాది
నా కంటి చారల వెనక చరిత్ర నన్ను తొక్కేసింది!
* * * *
ఇప్పుడు ఎక్కడ కూర్చొని ఏడ్చినా ఏం ప్రయోజనం

---

## ఓ మూల కూర్చోమన్నారు!

ఎక్కడా కూర్చోటం చేతకాక
నా పూర్వీకులు ఏడ్చిన చరిత్రలు తవ్వుతున్నా
ఎందుకు నా పూర్వీకులు ఓడిపోయారో అర్థం కాదు!
* * * *
నాలోని పూర్వీకుడ్ని నిరంతరం నిరాకరిస్తున్నా!

---

ఓ మూల కూర్చోబెట్టి ఏడ్వమన్నాక
నేను దారి తప్పి పోతానని వాళ్ళు భ్రమ పడ్డారు
ఓ యోధుడికి దారివుండదు –యుద్ధమేతప్ప
* * * *
నిరంతరం మరణించేవాడు నా ముందు కూర్చోలేడు!

---

మరణించే లోగానే తాడో పేడో తేల్చుకోవాలి
నీవు కూర్చోమన్న చోట మేము కూర్చోలేము
నీవు నిలబడమన్న చోట బానిసలం కాలేము
* * * *
నీవు నన్ను కూర్చోబెట్టి పాతపాట పాడమనొద్దు!

---

## కాలు పెట్టటానికి చోటులేని చోట!

నా కాలుకి నీ పాదముద్రలు అద్దికిచ్చావు
నా గుడిసెల్లోకి రహస్యంగా వచ్చిన చరిత్రనీది
మాతంగిగా మార్చి నడ్డి విరిచావు
* * * * *
పుట్టిన గడ్డనే అసహ్యించుకునేలా తొక్కేశావు!

---

ఎంతగా తిరిగాము
ఎంతగా పారిపోయాము ఎంతగా
పదేపదే ఖననం కాబడ్డ దేహాలతో నమస్కరించాము
* * * *
యేడ అనాథ శిశువు ఏడ్చినా వాడు మావాడే అన్నాము!

---

కూర్చోటం అంటే కుష్టి వాళ్ళగానో
ముష్టివాళ్ళ గానో దేహాన్ని ప్రతిష్టించటం కాదు
కూర్చున్నాక ఓ చెక్క బండి నా వర్తమానం కాదు
* * * *
రోగిష్టి వ్యవస్థలో మొదటి రోగానివి నీవు!

---

## మళ్ళీ ఎక్కడో కూర్చోటం గురించి!

కూర్చోటమో కూర్చోలేక పోవటమూ కాదు
మిమ్మల్ని కూర్చోబెట్టి మేం కోరినచోట
ఎందుకు కూర్చోలేక పోతున్నామో అర్థం కాదు!
* * * *
కుట్రని ఛేదించలేని పేదరిక దాస్యం మాది!

---

ఎవడు ఎక్కడ కూర్చోనంటాడో
వాడ్ని రూపుమాపే ఆలోచనలమధ్య
కడ చూపుని పెతుక్కునే శతాబ్దాల ఏడ్పులమధ్య
* * * *
మీ శవాలకి కాటికాపరులం మేము!

---

గడచిన కాలం ఇచ్చిన కానుక ఈ దాహం
సరిగ్గా నడవలేక కూలబడ్డవాళ్ళం
కల్లు ముంతలో కాలాన్ని తాగినవాళ్ళం!
* * * *
కూర్చొనే ఓ మూల శివతాండవం చేస్తాం!

---

## ఆటా మాటా పాట!

కూర్చోటం చేతకాని అస్థికల సంతతి మాది
ఆటా మాటా పాట దరువుల దొంగలు మీరు
మా గుడిసెల్లోకి వచ్చిన మీ కాళ్ళకి చెప్పులం మేము
* * * *
మీ గుండెల్లో కూర్చోటం గురించే మా తపనంతా!

---

ఒంగోని కూర్చోమన్నారు
వూడిగంతో పాకమన్నారు
వుంగటంతో వూరేగమన్నారు
* * * *
వూరికే కూర్చొని తిరగబడమనే మీ ప్రార్ధనలు మాకొద్దు!

---

ఒంగోని ఒంగోని కలుపుమొక్కలు ఏరిన మా అమ్మ
ఇచ్చిన కడకొంగుకి నా నమస్కారం
వూరికే కూర్చోమాకు శ్రమించమన్న నాన్నకి నా ప్రార్ధన
* * * *
నిలుపెల్లా నన్ను ఎదిరించే నా బిడ్డలకి ఆశీర్వాదం!

---

<u>మరోలా కూర్చోటం గురించి!</u>

రాత్రిళ్ళు వూరికే కూర్చోలేను
నిదురరాని రాత్రుళ్ళలోకి జారిపోలేను
అటూ ఇటూ తిరిగే ప్రాచీన బైరాగిని నేను
* * * *
నా కలలని నా పూర్వీకులు ముందే అమ్మేశారు!

---

ఏ ప్రాచీన దేవాలయం ముందు
నా పూర్వీకులు తప్పెటలు ఒదిలేశారో
అక్కడ ఓ విగ్రహం గర్వంగా నిలబడ్తుంది!
* * * *
అతడి కొత్త చరిత్రకోసం పాత చెప్పులు బాగు చేస్తాం!

---

రోడ్లు వూడుస్తా చీపుర్లకి
అలుసైన దేహ సౌందర్య కాంతులం మేము
నల్లగా వుంటేనేమి చీకటికి మేమంటే భయం
* * * *
మా కోసం ఓ ఒంటరి నక్షత్రం ఆకాశాన్ని వూడుస్తోంది!

---

## చెప్పులు కుడుతా!

చెప్పులు  కుడుతా కుడుతా
కొత్త పాదాలతో తిరగటం నేర్చుకున్నాము
ఈ చరిత్రకి ఎక్కడ మేకులు కొట్టాలో మాకు తెల్సు
* * * *
ఎంత వెంట పోగులు ఎత్తినా మీలోని చెత్తను చిమ్మలేము!

---

తిరిగి మీలోకి రమ్మన్నారు
మా యోధుల్ని చంపుతా చరిత్ర కడ్డమన్నారు
తిరగబడ్తున్న చరిత్రని మోస్తున్నాం మేము
* * * *
మొక్కిన చెట్టుని నరుక్కోలేని కొత్త బానిసలం!

---

ఈ రాత్రి మాకోసం ఏడుస్తా
తన రంగుని మాకు అద్దింది
ఆకాశంలోని నక్షత్ర చషకం మాకు మత్తునిచ్చాక
* * * *
ఈ నేల తల్లికి కొత్త ఉత్తరం రాస్తున్నాము!

---

## పొలిమేరల్లో కూర్చున్నాక!

పొలిమేరల్లో కూర్చొని మా వాయిద్యాలు
మాలోని రహస్య తంత్రులు మీటుతాయి
ఓ పండగ వుదయం లేచినప్పుడు కదా
* * * *
మా మరణం రాత్రికి వూపిరిని దానం చేసేది!

---

అన్ని తలుపులు మూసుకున్నాయి
కూర్చోమన్న చోట కూర్చోలేని దినచర్యతో
పెగటు పుడుతున్న మీ దీవెనలు మాకొద్దు
* * * *
ఏవీ మీ చేతులు - వాటినీ –మేము శుభ్రం చేస్తాం!

---

మిమ్మల్ని మేము మర్చిపోలేక పోతున్నాం
మీకు మా శుభాకాంక్షలు
మమ్మల్ని తొక్కిపెట్టిన మీ పాదాలకి నమస్తే
* * * *
మా చరిత్రని తవ్వుకోలేని మా జాతికీ నమస్తే!

---

(ఎజ్రా శాస్త్రి కోసం)